## వైభవంగా షిరిడీ సాయిబాబా ఆలయ రజతోత్సవాలు




**ఉప్పల్:** ఉప్పల్ ధర్మపురి కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయ రజతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజు ప్రత్యేక హోమాలు, 1001 కలశాల పూజ నిర్వహించారు. కలశాలతో చివరి రోజు మంగళవారం స్వామి వారికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు.

## కార్మికులకు మజ్జిగ పంపిణీ

**బోడుప్పల్:** చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం మల్లాపూర్ లోని బెల్ కంపెనీ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా కార్మికులు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు వెల్లండించారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, అత్యవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయేతర సిబ్బంది వసంత, జయ పాల్గొన్నారు.

## మే డే సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వేముల మారయ్య

**మల్లాపూర్:** ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మే 1న తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న మే డే సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆటోయూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించే మే డే ఉత్సవాల సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో స్కూల్ వ్యాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాతం రమేష్, హైద్రాబాద్ జిల్లా అధ్యక్షులు నిరంజన్, హైమాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

## కబేలాకు తరలిస్తున్న గోవుల పట్టివేత

**ఉప్పల్:** గోవులను కబేలాకు తరలిస్తున్న వ్యక్తులను తెలంగాణ గో రక్షక్ నేతలు బండారు పవన్ కుమార్ తదితరులు సోమవారం ఉప్పల్ గాంధీ బొమ్మ వద్ద అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 30 ఎద్దులు, 10 లేగ దూడలు, గోవులను స్వాధీనం చేసుకుని గోషామహల్ గోశాలకు తరలించారు. నల్గొండ జిల్లా మాల్ ప్రాంతానికి చెందిన శ్రీను అనే వ్యక్తి కంటైనర్‌లో బహదూర్‌పుర కబేలాకు వాటిని తరలిస్తున్నట్లు అంగీకరించాడు. గోవులను అక్రమ రవాణా చేస్తున్న శ్రీను, వాహన డ్రైవర్ రమావత్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

## ఈఎస్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



**మల్లాపూర్:** తెలంగాణ ప్రభుత్వం వైద్యుల సంఘం ఈఎస్ఐ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సతీష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ సీహెచ్.నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ పి.రమేష్, ఉపాధ్యాక్షులుగా వెంకట్‌రెడ్డి, దుర్గా పద్మజ, విజయ్‌కుమార్, జేసీ సభ్యులుగా డాక్టర్ శైలజ, లక్ష్మీకాంత్, రాజన్న. సంయుక్త కార్యదర్శిగా ఖాజామోహినుద్దీన్, పెంటాగౌడ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాజేంద్రప్రసాద్, బ్రీజామోహన్, శ్రీవాణి రత్నం, నరేంద్రం, తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చీమ శ్రీనివాస్, సతీష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈఎస్ఐసీపై చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామన్నారు. నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో వసతులు కల్పించాలని, ఈఎస్ఐ బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు.

## ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచిన కారు



పీర్జాదిగూడలో ప్రచారంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

**మేడిపల్లి:** మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పీర్జాదిగూడలో ఎన్నికల ప్రచారంలో తమదైన శైలిలో దూసుకుపోతూ.. స్పీడ్ పెంచిన నాయకులు కార్పొరేషన్ 4వ డివిజన్ అధ్యక్షుడు యాసారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీనగర్, గాంధీనగర్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు బండారి రవీందర్ పాల్గొని కారుగుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. డివిజన్ జనరల్ సెక్రటరీ రాజేష్ ఖన్నా, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, కమిటీ సభ్యులు మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి లోక్‌సభ బరిలో 22 మంది అభ్యర్థులు

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బరిలో 22 మంది అభ్యర్థులు మిగిలారని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. పరిశీలన తర్వాత 37 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామన్నారు. ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా 15 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు వారి సమక్షంలో గుర్తులు(సింబల్) కేటాయించినట్లు ఆయన తెలిపారు.

## ఐదు నెలలో పెరిగిన ఓటర్లు 28,141

**మేడ్చల్:** మేడ్చల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు మధ్య 28,141మంది ఓటర్లు పెరిగారు. మేడ్చల్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల నాటికి 6,37,838 మంది ఓటర్లు ఉండగా నేటి ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య 6,65,979 మందికి చేరింది. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు నియోజకవర్గంలో 28,141 ఓటర్లు పెరిగారు. ఇందులో పురుషులు 3,40,218 మంది ఉండగా మహిళలు 3,25703 మంది 58 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.

# అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



చర్లపల్లిలో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



బోడుప్పల్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సంజీవ్‌రెడ్డి

**కుషాయిగూడ:** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో వస్తున్న ప్రజాదరణే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా సోమవారం ఆయన చర్లపల్లి డివిజన్, లక్ష్మీనర్సింహకాలనీ, శివసాయినగర్ కాలనీల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు డప్పు గిరిబాబు, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**ఉప్పల్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తాయని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. సోమవారం ఆమె డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జగన్ పాల్గొన్నారు.

**లక్ష్మారెడ్డిని గెలిపించాలి**

**బోడుప్పల్:** మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లోని 22 డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, యూత్ నాయకులు పులకండ్ల కీర్తన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు**

**మల్లాపూర్:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు గుణపాఠం తప్పదని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మద్దతుగా సోమవారం ఆయన మల్లాపూర్‌లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మపురి కాలనీ, నాగలక్ష్మీనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

**నాచారంలో..**

నాచారం డివిజన్ పరిధిలోని స్నేహపురి, వీఎస్టీ కాలనీలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్‌శేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఓటర్లకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే మల్కాజ్‌గిరి అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు**

**రామంతాపూర్:** మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆయన సతీమణి రజినిరెడ్డి అన్నారు. సోమవారం ఆమె మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నతో కలిసి ఇందిరానగర్, మెట్టుగల్లీ నుంచి ప్రగతినగర్, నేతాజీనగర్, అరవింద్‌నగర్‌లలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావు, శుభం శంకర్, పవన్ పాల్గొన్నారు.

**రాగిడికి మద్దతుగా ప్రభాకర్‌రెడ్డి ప్రచారం**

**రామంతాపూర్:** హబ్సిగూడ రాంరెడ్డినగర్‌లో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ కైలాష్‌పతిగౌడ్, డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ బీవీ చారి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



నాచారంలో బొట్టుపెట్టి ఓటు అడుగుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్



చిలుకానగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



హెచ్‌బీకాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్



రామంతాపూర్‌లో ప్రచారం చేస్తున్న రాగిడి రజని

## బీజేపీ పదేళ్ల పాలనలో పథకాలు కనుమరుగు



లక్ష్మీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

**ఉప్పల్:** బీజేపీ పదేళ్ల పాలనలో దేశం అథోగతి పాలైందని కాంగ్రెస్ నాయకులు మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డికి మద్దతుగా ఉప్పల్ సాయిబాబా టెంపుల్ కాలనీ, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. చేయి గుర్తు కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశం అథోగతి పాలైందన్నారు. సంక్షేమ పథాలు కనుమరుగయ్యాయని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంతోనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతు సేవా సంఘం నాయకులతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**అందరూ సమష్టిగా పనిచేయాలి**

**అల్వాల్:** అల్వాల్‌లో రైతు సేవా సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తోట దుష్యంత్‌రెడ్డి ఇంట్లో అల్పాహార విందుకు సోమవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హాజరై పలువురితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకత్వం, కార్యకర్తలు ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే మల్కాజిగిరిలో గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్ పటేల్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌కు అన్ని వర్గాల మద్దతు**

**కుషాయిగూడ:** కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. కాంగ్రెస్ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వివరిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, నవనీతరెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి**

**మల్లాపూర్:** కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ లేబర్ వైస్ ఛైర్మన్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు వీఎస్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా నాచారం డివిజన్ పరిధిలోని హబ్సిగూడ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేసిన ఆయన హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, అశ్వత్థామరెడ్డి, మహేష్ యాదవ్, నర్సింగ్ రావు,రఘు, గద్ద క్రాంతి, వెంకట్‌రెడ్డి, నవీన్, యూసఫ్, ఉమా, లీల, జయ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

## బీఆర్ఎస్ మైనార్టీ సమన్వయ కమిటీ ఏర్పాటు

**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు బండారి రవీందర్ అధ్యక్షతన ముస్లిం మైనార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పలు డివిజన్ల నాయకులు, పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకు మైనార్టీ కమిటీ నూతన అధ్యక్షుడిగా షేక్‌జీలానీ పాషా, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ జాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ సుభాన్, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ ఖైసర్, షేక్ ఇబ్రహీంను ఎన్నుకున్నారు. అనంతరం మైనార్టీ యువజన కమిటీని ఎన్నుకున్నారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏనుగు మనోరంజన్ రెడ్డి, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మైనార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు

## సమస్యల పరిష్కారమే ధ్యేయం



చంగిచర్లలో స్థానికులతో ముచ్చటిస్తున్న ఈటల

**బోడుప్పల్:** చెంగిచర్ల ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో చెంగిచర్లలో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. చెంగిచర్లలోని స్లాటర్ హౌజ్ నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, కరెంట్‌లో ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు రాజేందర్ దృష్టికి తీసుకొచ్చారు. తాను గెలిచిన వెంటనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామల పవన్‌రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏర్పుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ ఇంటింటి ప్రచారం**

**రామంతాపూర్:** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, గోఖలేనగర్ ప్రాంతాల్లో సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి కార్యకర్తలు, నాయకులతో కలిసి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి ఈటలకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకటరమణ, బాలసుబ్రహ్మణ్యం, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణ, నాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**ఈటలకు మద్దతుగా కార్పొరేటర్ ప్రచారం**

**రామంతాపూర్:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాలకృష్ణనగర్, 265 బూత్ పరిధిలో బూత్ అధ్యక్షుడు బాలాజీ, కో ఆర్డినేటర్ నగేష్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మహిళా కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు తాళ్ల మంగాగౌడ్, అంబటి భాగ్యలక్ష్మీ, అరుణ, వీణ , ప్రేమలత, శారద పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభాకర్, కార్పొరేటర్



బాలకృష్ణనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

## అన్నపూర్ణ సొసైటీలో స్థలం విషయంలో వాగ్వాదం



స్థానికులు, కబ్జాదారుల వాగ్వాదం

**గౌతంనగర్:** గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీలో ప్రజావసరాలకు ఉపయోగిస్తున్న సుమారు 230 గజాల కమ్యూనిటీ హాలు స్థలం తమదంటూ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కమ్యూనిటీహాలుకు తాళం వేశారు. సమాచారం అందుకున్న స్థానిక మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని కబ్జాదారులను అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజావసరాలకు ఉపయోగపడే స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించుకున్నామని, ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి హాలు స్థలం తమదంటూ అనడం సబబు కాదన్నారు. ఇరు వర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి ఇరు వర్గాలను సముదాయించారు. అనంతరం కబ్జాదారులు వేసిన తాళాన్ని స్థానికులు తొలగించి మరో తాళాన్ని వేశారు.

## అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఉన్నికృష్ణన్

**అల్వాల్:** అంగన్‌వాడీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ అన్నారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం యూనియన్ కార్యదర్శి శోభారాణి అధ్యక్షతన యాప్రాల్‌లో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో బకాయిపడ్డ ఏడు నెలల స్కూల్ కిరాయి ఇవ్వడం లేదని, టీచర్లు వారికి వచ్చే జీతం నుంచి కిరాయి కడుతున్నారన్నారు. టీచర్లకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సమస్యలను సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌తోనే మాదిగ ఉపకులాల అభివృద్ధి

**ఉప్పల్:** మాదిగ ఉప కులాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాదిగ ఉపకులాల ఫ్రంట్ సభ్యులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పెద్దలు చొరవ తీసుకుంటున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు రాజదశరథ్ కార్యదర్శి జి. గణేష్, బి. యాదగిరి ఉన్నారు.